సాక్షి వికారాబాద్

ఆదివారం । 10 । నవంబర్ । 2024



జాతర ప్రత్యేకం

అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయ పెద్ద జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది.

8లో▸



భరించలేక పోతున్నాం

ఓవర్‌లోడ్ లారీలతో రోడ్లు ధ్వంసమై దుమ్ము చెలరేగి ఇబ్బంది పడుతున్నామని కరన్‌కోట్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

8లో▸



ఉల్లి సాగు.. లాభాలు బాగు

ఉల్లిసాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. ఇటీవల బహిరంగ మార్కెట్‌లో ఉల్లి పంటకు భారీ డిమాండ్ ఉంది.

8లో▸

న్యూస్‌రీల్

సర్వేను అడ్డుకున్న రైతులు



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న రైతులు

నవాబుపేట: మండలంలోని పులుమామిడి, మాదిరెడ్డిపల్లి గ్రామాల మధ్య రీజనల్ రింగ్, రైల్వే లైన్ కోసం ఓ ప్రైవేటు ఏజెన్సీ శనివారం సర్వేను ప్రారంభించింది. ఈ విషయం తెలుసుకున్న ఆ రెండు గ్రామాల రైతులు తమ పొలాల వద్ద ఎందుకు సర్వే చేస్తున్నారని నిలదీశారు. రీజనల్ రింగ్, రైల్వే లైన్ కోసం సర్వే చేస్తున్నామని సిబ్బంది తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. సర్వే పనులను అడ్డుకున్నారు. దీంతో సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



కుల్కచర్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మండల దీక్షలో భాగంగా మాలధారణ చేసిన భక్తులు పూజలు, భజన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు తాండూరుకు హైకోర్టు న్యాయమూర్తి

తాండూరు: పట్టణంలోని మున్సిఫ్ కోర్టు ప్రాంగణంలో నేడు(ఆదివారం) అడిషనల్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి నాగేష్ భీమపాక ప్రారంభించనున్నారు. ఇందుకోసం తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గనూర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు న్యాయమూర్తి శివలీల, బార్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి అడిషనల్ కోర్టును ప్రారంభించనున్నారు. అనంతరం వినాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమానికి అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు హాజరు కావాలని అగ్గనూర్ శ్రీనివాస్ కోరారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

యాచారం: రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని డీఆర్‌డీఏ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని చింతపట్ల, నందివవనపర్తి గ్రామాల్లో తెలంగాణ గ్రామాణాభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరుగాలం పండించిన పంటను నాణ్యమైన మద్దతు ధర, సకాలంలో డబ్బులు అందే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించే క్వింటాల్ ధాన్యం గ్రేడ్ ఎ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ. 2,300గా నిర్ణయించినట్లు తెలిపారు. నింబంధనల ప్రకారం రైతులు నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం నర్సింహ, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, సీసీ నర్సింహ పాల్గొన్నారు.

రింగ్ రైల్ నిర్మాణానికి సర్వే



హెలిక్యాప్టర్ సర్వే

కొందుర్గు: రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ నిర్మాణానికి శనివారం హెలికాప్టర్ ద్వారా సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆర్వీ అసోసియేషన్ ఏజెన్సీ ప్రతినిధులు సర్వే పనులు మొదలుపెట్టారు. రెండు నెలల క్రితం మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్, కొందుర్గు, తంగెళ్లపల్లి మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకోసం మార్కింగ్ చేసిన చిహ్నాల ఆధారంగా సర్వే పనులు చేపట్టారు. హెలికాప్టర్ ద్వారా ఆయా గ్రామాల మీదుగా సర్వే నిర్వహించారు. కాగా రింగ్ రోడ్డు, రింగ్ రైల్ నిర్మాణం పనులు చేపడితే తమ పొలాలు ఎక్కడ పోతాయోనని ఆయా గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వికారాబాద్‌లోని ఓ ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు, పర్యవేక్షిస్తున్న అధికారులు



సర్వే షురూ..

జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన కుటుంబ వివరాల సేకరణ

- వ్యక్తిగత సమాచారం చెప్పేందుకు జనం నిరాసక్తత
- కొన్ని చోట్ల పూర్తికాని ఇళ్ల జాబితా సేకరణ ప్రక్రియ

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ మొదటి రోజు శనివారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఇళ్లకు వెళ్లి కుటుంబ వివరాలు సేకరించే పని మొదలు పెట్టారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ మొదలుకొని మున్సిపల్ చైర్‌పర్సన్లు, కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు దగ్గరుండి పర్యవేక్షించారు. ఒక్కో ఇంటి వద్ద వివరాల సేకరణకు 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది. మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో సర్వే ప్రారంభం కాగా రూరల్ ఏరియాల్లో ఫారాలు అందక ఆలస్యం అయ్యింది. ఎన్యుమరేటర్లు కొన్ని ఇళ్లను మాత్రమే సందర్శించారు.

సిద్ధం కాని యంత్రాంగం

జిల్లాలో సర్వే కోసం అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లు కనిపించలేదు. ఈ నెల 5లోపే ఇళ్ల జాబితాను సిద్ధం చేసి స్టిక్కర్లు అతికించాల్సి ఉంది. అయితే అర్బన్ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో సమాచారం సేకరించడంలో జాప్యం జరిగే అవకాశం లేకపోలేదు.

మొదటి సారి ప్రత్యేక సమాచారం

సర్వే ఫారాల్లో పార్ట్ వన్ పార్ట్ టూలో కలిపి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు ఉన్నాయి. పార్ట్ టూలో ఇచ్చిన ప్రశ్నలకు అనుబంధ ప్రశ్నలు ఉన్నాయి. గతంతో ఏ సర్వేలో కూడా పొందుపరచని కొన్ని ప్రశ్నలు ఇందులో ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారికి సంబంధించిన ప్రశ్నలు అడిగారు. ఒకవేళ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే టర్నోవర్ ఎంత..? అని అడిగారు. రాజకీయ పదవులకు సంబంధించిన సమాచారం కూడా అడిగారు. అనుభవిస్తున్న రాజకీయ పదువులు, గతంలో ఏమైనా పదవులు చేపట్టారా..? చేపడితే అవి నామినేటెడ్‌వా.. వంటి ప్రశ్నలు పొందుపరిచారు.

కొన్ని చోట్ల ఎదురు ప్రశ్నలు

సర్వే కోసం వెళ్లిన ఎన్యుమరేటర్లకు ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలు వచ్చాయి. పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది. వ్యక్తిగత సమాచారం ఇచ్చే సమయంలో కొందరు దాటవేత ధోరణి అవలంబించారు. ప్రధానంగా ఎన్ని కార్లు ఉన్నాయి..? ఎన్ని ఇళ్లు ఉన్నాయి లాంటి ప్రశ్నలు అడిగిన సమయంలో ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలు వచ్చాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు వందలు, వేల కోట్ల ఆస్తులు ఉంటాయి.. పదుల సంఖ్యలో కార్లు ఉంటాయి అవన్నీ రాస్తారా ? అంటూ నిలదీశారు. ఇంకొన్ని చోట్ల రేషన్ కార్డు, పింఛను, రైతు భరోసా లాంటివి లేకుండా చేయటానికా అని అడిగారు.

“ చాలా ప్రశ్నలు అడిగారు



సర్వే అధికారులు తనను చాలా ప్రశ్నలు అడిగారు. పింఛన్ వస్తోందా?, భూమి ఎంత ఉంది? సబ్సిడీ గ్యాస్ వస్తోందా?, ఫ్రీ బస్సు ప్రయాణం చేశారా? ఏ కులం, ఏ మతం ఇలాంటి చాలా ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ సమాధానం చెప్పా. సర్వే చేయడానికి వచ్చిన వారు నెమ్మదిగా ప్రశ్నలు అడుగుతుంటే ఏమీ దాచి పెట్టకుండా అన్నింటికీ సమాధానాలు చెప్పా.

– రాజమ్మ, 11వ వార్డు, తాండూరు టౌన్

అన్ని వివరాలు చెప్పా



సర్వే కోసం అధికారులు మా ఇంటికి వచ్చారు. వారు అడిగిన అన్ని ప్రశ్నలకు నిర్భయంగా సమాధానం చెప్పా. భర్త చనిపోయినా పెన్షన్ రాలేదని వివరించా. బ్యాంక్ అకౌంట్ ఉందా, లేదా అని అడిగారు కానీ అకౌంట్ నంబర్ అడగలేదు. సర్వే ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తే బాగుంటుంది.

– సిరిపురం ఇంద్రమ్మ, గౌతాపూర్, తాండూరు మండలం



యాలాల: అగ్గనూరులో సర్వే చేస్తున్న అధికారులు

ఒక్కో కుటుంబానికి 50 నిమిషాల సమయం

యాలాల: మండలంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే శనివారం నుంచి ప్రారంభమైంది. మొదటి రోజే సర్వే మెటీరియల్ ఆలస్యంగా రావడంతో చాలా గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి ప్రక్రియను ప్రారంభించారు. పలు గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వే జరగలేదు. ఒక్కో కుటుంబం నుంచి వివరాల సేకరణకు దాదాపు 45 నిమిషాల నుంచి గంట సమయం పట్టింది. ప్రజలు కుటుంబ వివరాలు చెబుతున్నా భూములు, ఇళ్లు, రుణాలు, రేషన్‌కార్డు తదితర వివరాలు చెప్పేందుకు జంకుతున్నారు.


విస్తృత ప్రచారం చేయాలి

తాండూరు రూరల్: గ్రామాల్లో చాలామంది వ్యవసాయం, కూలి పనులపై ఆధారపడి జీవిస్తుండటంతో అధికారులు ఎప్పుడు సర్వే కోసం వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఎటు వైపు నుంచి సర్వే నిర్వహిస్తున్నారో తెలియక, ఇంటి వద్దే ఉండాలా.. వ్యవసాయ పనులకు వెళ్లాలా అనే మీమాంసలో ఉండిపోయారు. ఈరోజు ఫలానా కాలనీలో ఎన్యుమరేటర్లు సర్వే చేపడతారని ముందస్తుగా సమాచారం లేకపోవడంతో అయోమయానికి గురయ్యారు. ఇక గ్రామాల్లో అధిక శాతం నిరక్షరాస్యులు కావడంతో ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతూ కనిపించారు. సర్వే చేయడానికి ఒక రోజు ముందు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనే డిమాండ్ చాలా మంది నుంచి వ్యక్తమైంది.



గౌతాపూర్‌లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

వివరాలు నమోదు చేయించుకున్న డీసీసీబీ చైర్మన్



వివరాలు నమోదు చేసుకుంటున్న కొత్తకుర్మ సత్తయ్య దంపతులు

తుర్కయంజాల్: సర్వేలో భాగంగా తుర్కయంజాల్‌లోని తమ ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కుటుంబ వివరాలు తెలిపి నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సర్వేను చేపడుతోంని, దీంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు దక్కుతాయని అన్నారు. సమగ్ర సర్వేలో ప్రజలంతా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజలు సహకరించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సర్వే కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. శనివారం నగరం నుంచి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై సీఎస్ శాంతికుమారి.. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణంలోని ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన సీపీఓ, డీపీఓ, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. సర్వేలో భాగంగా ప్రజల నుంచి కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. ఈ ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నిష్పక్షపాతంగా, ఎలాంటి పొరపాట్లుకు ఆస్కారం లేకుండా సమాచారం పొందుపరచాలని సూచించారు. సర్వేకు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, దీనిపై ఎలాంటి అపోహలు వద్దని పేర్కొన్నారు. సర్వేపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఎంపీడీఓ, తహసీల్దార్ల దృష్టికి తెచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీపీఓ జయసుధ, సీపీఓ అశోక్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు, సిబ్బంది అంకిత భావంతో పూర్తి చేయాలని సెర్ప్ సీఈఓ, ప్రజావాణి నోడల్ అధికారి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై కలెక్టర్ నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్యుమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల్లో ఏవైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలన్నారు. ఇచ్చిన ప్రొఫార్మాలో సమాచారాన్ని క్రోడీకరించాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యుమరేటర్లకు సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని విడిచి పెట్టొద్దని, అన్ని కుటుంబాల వివరాలు సమగ్రంగా సేకరించేలా ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజే ఆయా కుటుంబాలకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్లు



శివారెడ్డిపేట్‌లోని పోలింగ్ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట్‌లో గల 133, 134 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. జాబితాలో మార్పులు, చేర్పుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఓటరు నమోదుకు బూత్‌స్థాయిలో ఆది సోమవారాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జనవరి ఒకటి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రెండు కలర్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో కేంద్రాలకు రావాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఓటరు నమోదు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, బీఎల్ఓలు స్వరూప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

మాలల ఆత్మీయ సమ్మేళనంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్



ఇబ్రహీంపట్నం: హక్కుల సాధనకు మాలలు సంఘటితంగా ఉద్యమించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ పిలుపునిచ్చారు. మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గ మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వివేక్ మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగలేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాలలను ఎంతో బాధకు గురిచేసిందన్నారు. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, పార్లమెంట్ ఆమోద తీర్మానాలతో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి తప్ప ఏకపక్షంగా చేయడం సరైన పద్ధతికాదన్నారు. విభేదాలు పక్కన పెట్టి మాలలు హక్కుల సాధనకు సైనికుల్లా ఉద్యమించాలన్నారు. పోరాట పటిమతో ముందుకెళ్తేనే రాజకీయంగా చలనం కలుగుతుందన్నారు. మాలల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాలల ఐక్య వేదిక నియోజకవర్గ కన్వీనర్ మారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎస్ గోపీనాథ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఈడీ సర్వయ్య, సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కాంబ్లి, ఉద్యమకారుడు రేంజర్ల షాన్ రాజేశ్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య, మందల భాస్కర్, టీఎంఐవీ అధ్యక్షుడు బాలకిషన్, కౌన్సిలర్ జగన్, ఐక్యవేదిక నేతలు పాల్గొన్నారు.



కళరిపయట్టుపై శిక్షణ ఇస్తున్న రమేష్

శత్రువును నిలువరించేట్టు
కళరిపయట్టు

- యుద్ధ విద్యలో నాలుగేళ్ల పాటు కఠోర శిక్షణ పొందిన రమేష్
- ఇండియన్ మార్షల్ ఆర్ట్ కళరిపయట్టు ట్రైనర్ స్థాయికి..
- జిల్లా స్థాయిలో మూడు సార్లు, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు మెడల్స్
- వందలాది మందికి శిక్షణ ఇస్తున్న గురువు



కొడంగల్ రూరల్: కళరిపయట్టు.. కేరళ రాష్ట్రంలో ఆవిర్భవించిన ఓ యుద్ధ క్రీడ.. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది.. ఏ ఆయుధం లేకుండా శత్రువును నిలువరించే యుద్ధ క్రీడ కళరి పయట్టు. కొడంగల్ మండలం ఖాజాఅహ్మద్‌పల్లికి చెందిన రమేష్ కళరిపయట్టుపై అభిమానంతో నాలుగేళ్లపాటు కేరళలో కఠోర శిక్షణ పొందాడు. ప్రస్తుతం ఇండియన్ మార్షల్ ఆర్ట్ కళరిపయట్టు ట్రైనర్ స్థాయికి చేరారు. కొడంగల్, కోస్గి, నల్గొండ తదితర ప్రాంతాల్లో ఈ విద్యపై వందలాది మందికి శిక్షణ ఇస్తున్నారు.

కుటుంబ నేపథ్యం..

తండ్రి అనంతయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి గోపమ్మ గృహిణి. అన్న నర్సింలు. రమేష్ కొడంగల్‌లో డిగ్రీ వరకు చదివాడు. ఉస్మానియాలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశాడు. కళరిపయట్టు విద్య నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు కొంత కాలం అడ్డుకున్నాయి. 2020లో కేరళ రాష్ట్రంలోని కేరళి కళరి సంఘం పలక్కాడ్ గురుకులంలో చేరాడు. నాలుగేళ్లపాటు ఎన్నో కష్టాలను ఎదుర్కొని యుద్ధ విద్యను నేర్చుకున్నాడు. ఆ తర్వాత జిల్లా స్థాయిలో మూడు పర్యాయాలు, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు మెడల్స్ సాధించాడు. 2024లో సొంత గ్రామం ఖాజాఅహ్మద్ పల్లిలో స్థానిక యువకులకు శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టాడు. ఇప్పటివరకు దాదాపు మూడు వందల మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మరో 70మంది శిక్షణ ఇస్తున్నట్లు రమేష్ తెలిపారు. గత నెల 19, 20వ తేదీల్లో కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కళరిపయట్టు పోటీల్లో కొడంగల్‌కు చెందిన కుర్రాళ్లు రమేష్, అనిల్, మణికంఠ ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఆత్మ రక్షణతోపాటు ఆరోగ్యం



కళరిపయట్టు విద్య చాలా పురాతనమైనది. ఈ యుద్ధ విద్య నేర్చుకుంటే జ్ఞాపక శక్తి పెరుగుతుంది. సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవచ్చు. శిక్షణా కాలం ఏడేళ్లు.. శత్రువు ఎలాంటి ఆయుధంతో వచ్చినా ఒట్టి చేతులతో కాపాడుకోచ్చు. ఆత్మ రక్షణ తోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుంది

– రమేష్ శిక్షకుడు, కొడంగల్

కార్తీకమాసం.. జాతర ప్రత్యేకం

రేపటి నుంచే అనంతగిరిగుట్టలో ఉత్సవాలు

- శోభాయమానంగా అనంతపద్మనాభుడి ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వికారాబాద్‌ సమీపంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో కార్తీకమాస సందర్భంగా పెద్ద జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 25 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త ఎన్‌.పద్మనాభం, ఈఓ నరేందర్‌ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ధ్వజారోహనంతో ఉత్సవాలు మొదలవుతాయి. 12న కార్తీక ఏకాదశి ఉత్సవం, 13న రాత్రి 7గంటలకు తులసీ వివాహం నిర్వహిస్తారు. 15న పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి కల్యా ణోత్సవం ఉంటుందన్నారు. 25న ఉదయం 11 గంటలకు ఆలయ పుష్కరిణిలో చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.


కొలువుదీరిన అనంతపద్మనాభుడు

15 రోజుల పాటు తాకిడి

కార్తీక మాసంలో 15రోజుల పాటు పెద్ద జాతర జరుగుతుంది. ఉత్సవాలకు వికారాబాద్‌ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌, మహబూబ్‌నగర్‌, నాగర్‌కర్నూల్‌, జహీరాబాద్‌, సంగారెడ్డి, షాద్‌నగర్‌, కొడంగల్‌, నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

జాతరకు ముస్తాబు

జాతరకు సంబంధించి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా విద్యుత్‌ దీపాలను ఏర్పాటు చేసి ఆలయాన్ని శోభాయానుమానంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆలయ చరిత్ర ఘనం

అనంతగిరి గుట్టలో వెలసిన శ్రీ పద్మనాభస్వామి ఆలయం ద్వాపర యుగం నాటిదని, దాదాపు ఐదు వేల సంవత్సరాల చరిత్ర ఉందని స్థల పురాణం ద్వారా అవగతం అవుతుంది. స్వామి దర్శనం కోసం మార్కండేయ మహర్షి తపస్సు చేసాడని, దానికి మెచ్చుకొని భగవంతుడు శ్రీకృష్ణుని అవతారంలో మహర్షికి దర్శనమిచ్చాడని ఆలయ చరిత్ర చెబుతుంది. అనంతపద్మనాభుడిగా సాలగ్రామ శిలారూపంలో కూర్చున్నట్లుగా స్కంధ పురాణం బట్టి తెలుస్తుంది. పూర్వం అనంతగిరి నుంచి కాశీకి వెళ్లేందుకు గుహ ఉండేదని, దానిలో నుంచే నిత్యం మార్కండేయుడు కాశీకి వెళ్లి విశ్వనాథుడిని దర్శనం చేసుకుని గంగాజలం తీసుకువచ్చి ఇక్కడ స్వామి వారికి అభిషేకం చేసేవారని ప్రతీతి. కలియుగం ప్రారంభమయ్యాక ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారిని అర్చిస్తే స్వయం గంగా అనంతగిరి క్షేత్రానికి వచ్చి పుష్కరిణిగా మారిందని ప్రశస్తి.


ఆలయ ఆవరణలో హనుమంతుడు

ఇక్కడ స్నానం చేస్తే గంగా స్నాన ఫలం అని, స్వామిని దర్శించుకుంటే బద్రియాత్ర అంతటి పుణ్యమని పురాణం చెబుతుంది. కార్తీక మాసంలో ఎవరైతే సాలగ్రామ దర్శనం చేసుకుంటే అనేక జన్మల పాపాల పరిహారం, కోటి కన్యాదాన ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మెజిస్ట్రేట్‌ అశోక్‌కు ప్రశంస



అనంతగిరి: న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమర్థవంతంగా సేవలందించిన జడ్జిలకు ప్రశంసాపత్రాలు అందించారు. శనివారం వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌ జస్టిస్‌ సుజోయ్‌ పాల్‌ నుంచి జిల్లా సెకండ్‌ క్లాస్‌ జ్యుడీషియల్‌ మేజిస్ట్రేట్‌ నామాల అశోక్‌ ప్రశంసాపత్రం అందుకున్నారు.

విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్‌ సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని పరిగి ఏడీఈ వెంకటనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్‌ యార్డు రోడ్డు, హనుమాన్‌ మందిర్‌ రోడ్డుపై విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేకాట రాయుళ్లపై కేసు

పెద్దేముల్‌: పోలీసులకు వచ్చిన నమ్మదగిన సమాచారంతో శనివారం పేకాట స్థావరాలపై దాడులు జరిపారు. మండలంలోని నాగులపల్లి గ్రామ శివారులోని ఓ గుట్ట ప్రాంతంలోని పేకాట ఆడుతున్న వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.ఎనిమిది వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గిరి హెచ్చరించారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

సహాయక చర్యల్లో పాల్గొన్న కరన్‌కోట్‌ పోలీసులు


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్‌: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా సమీపంలోని కమలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా వనపర్తికి చెందిన నాలుగురు మృతి చెందారు. డీజీపీ జితేందర్‌రెడ్డి, వికారాబాద్‌ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తాండూరు మండలం కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తన బృందంతో కర్ణాటకలోని రోడ్డు ప్రమాద సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాలను అక్కడే ఉన్న స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అయితే గుల్బర్గాకు వికారాబాద్‌ జిల్లా తాండూరు ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో సరిహద్దులోని కరన్‌కోట్‌ పోలీసులకు ఉన్నతాధికారులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారని ఎస్‌ఐ తెలిపారు.

గర్భకోశ చికిత్స తప్పనిసరి

పశువైద్యుడు అశోక్‌రెడ్డి

బంట్వారం: పశువులకు గర్భకోశ చికిత్స తప్పనిసరిగా చేయించాలని పశువైద్యులు సూచించారు. శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని అన్నాసాగర్‌ గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. పశువుల వైద్యుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఎదకు రాని పశువులను గుర్తించి తగిన చికిత్స చేశారన్నారు. పశువులకు పలు సమస్యలను గుర్తించి అవసరమైన మందులు ఇచ్చామన్నారు. 34 గేదెలకు చూడి నిర్ధారణ పరీక్షలు, 58 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు చెప్పారు. అలాగే 62 లేగదూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు వివరించారు. కార్యక్రమంలో జూనియర్‌ వెటర్నరీ అధికారి నర్సింలు, గోపాల మిత్రలు బందయ్య, నరేందర్‌, శ్రీనివాస్‌, రైతులు పాల్గొన్నారు.


అన్నాసాగర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

దుమ్మును భరించలేక పోతున్నాం

ఓవర్‌లోడ్‌తో లైమ్‌స్టోన్‌ తరలిస్తున్న లారీలను నిలిపేసిన కరన్‌కోట్‌వాసులు


ఆందోళనతో కరన్‌కోట్‌ గ్రామ శివారులో నిలిచిపోయిన లారీలు

తాండూరు రూరల్‌: ఓవర్‌లోడ్‌ లారీలతో రోడ్డు ధ్వంసమై దుమ్ము చెలరేగి సతమతమవుతున్నామని మండలంలోని కరన్‌కోట్‌ గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. బెల్కటూర్‌ గ్రామ సమీపంలో ఓ సిమెంట్‌ ఫ్యాక్టరీ ఉంది. దీనికి కరన్‌కోట్‌ గ్రామ సమీపంలో ఉన్న క్రషర్‌ నుంచి ప్రతిరోజు లారీల్లో లైమ్‌స్టోన్‌ను తరలిస్తారు. ఈ క్రమంలో ఓవర్‌లోడ్‌తో లారీలు వెళుతుంటాయి. దీంతో దుమ్ము, ధూళి చెలరేగి తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం టార్పాలిన్‌ కూడా కప్పడంలేదని ఆందోళన చేపట్టారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు. సిమెంట్‌ ఫ్యాక్టరీ యజమాన్యం వెనకాల నియోజకవర్గస్థాయి నాయకుల అండదండలతో యథేచ్ఛగా ఓవర్‌లోడ్‌ తరలిస్తున్నారని గ్రామస్తులు ఆక్షేపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.

ప్రహరీలు లేక.. పరేషాన్‌

పాఠశాలల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రహరీ లేని గోకఫసల్‌వాద్‌ ఉన్నత పాఠశాల

దౌల్తాబాద్‌: పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు రూ.లక్షలు వెచ్చించి పాఠశాలలను నిర్మిస్తున్నా ప్రహరీలు లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 35 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇందులో 4వేలకుపైగా మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వీటిలో కొన్ని పాఠశాలలను నూతనంగా రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించినా ప్రహరీలు నిర్మించకపోవడంతో వాతావరణంతా అపరిశుభ్రంగా మారుతుంది.

అపరిశుభ్ర వాతావరణం

మండలంలోని గోకఫసల్‌వాద్‌, తిమ్మారెడ్డిపల్లి, అంతారం, గుముడాల, ఈర్లపల్లి, సురాయిపల్లి తదితర పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వానాకాలంలో వర్షపు నీరు పాఠశాల ఆవరణలోకి చేరడంతో అపరిశుభ్రంగా మారుతుందని వాపోయారు. అలాగే ప్రహరీ లేని కారణంగా రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారుతుందని మద్యం బాటిళ్లు ఆవరణలో పగులగొడుతున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రహరీలు నిర్మించాలని కోరుతున్నారు.

వ్యక్తిగత విషయమై ఘర్షణ

మాటూరులో ఇరువర్గాల బాహాబాహి


యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

దౌల్తాబాద్‌: ఇరువురి మధ్య తలెత్తిన వ్యక్తిగత ఘర్షణ రెండు వర్గాలకు పాకడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటన మండలంలోని మాటూరు గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించి పరిస్థితిని చక్కబెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు హన్మంతుకు, స్థానిక శివకుమార్‌రెడ్డి ఉదయం ఫోన్‌లో వ్యక్తిగత విషయమై గొడవ పడ్డారు. అనంతరం గొడవ సద్దుమణిగింది. సాయంత్రం వేళ హన్మంతు వర్గానికి చెందిన కొంతమంది పక్కనే ఉన్న రావల్‌పల్లి గ్రామానికి టీ తాగడానికి వెళ్లారు. అక్కడ ఉదయం జరిగిన సంఘటనపై మరోవర్గంతో గొడవ పడ్డారు. స్థానికులు సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. తర్వాత రాత్రి 7గంటలకు తిరిగి మాటూరు గ్రామంలో రెండు వర్గాలకు చెందిన యువకులు రోడ్డుపై ఘర్షణ పడ్డారు. ఇందులో హన్మంతు తమ్ముడు పరమేష్‌కు తీవ్ర గాయాలవ్వగా మరికొందరు సైతం గాయపడ్డారు. ఈ విషయం పోలీసులకు అందడంతో కొడంగల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట ఎస్‌ఐ రవూఫ్‌ వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ గ్రామస్తులకు వివరించారు.


దాడిలో గాయపడ్డ పరమేష్‌

ఓటరు సవరణకు సహకరించండి

- అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌

కొడంగల్‌: పోలింగ్‌ కేంద్రాలను అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని 237, 238, 239, 240, 241, 242, 244వ నంబర్‌ గల పోలింగ్‌ కేంద్రాలను సందర్శించారు. ఓటరు నమోదు ప్రక్రియ గురించి బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నవంబర్‌ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్లుగా ఉన్న వ్యక్తులు ఎవరైనా చనిపోతే జాబితా నుంచి పేరును తొలగించాలన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే సవరణలు చేసుకోవచ్చన్నారు. బీఎల్‌ఓలు పోలింగ్‌ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్‌: వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్‌ కలెక్టర్‌

తుంకిమెట్లలో పరిశీలన

బొంరాస్‌పేట: ఓటు హక్కుకు అర్హులైన యువతీ యువకులను ఇంటింటి సమగ్ర సర్వే ద్వారా గుర్తించాలని సూచించాలని అడిషన్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుంకిమెట్లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తాజాగా చేపట్టిన కొత్త ఓటరు నమోదులో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా నమోదు చేసుకునేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ మల్లేశ్‌, ఆర్‌ఐ శైలజ, నాయకులు మోహన్‌రెడ్డి, మేగ్యానాయక్‌, అంజిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్‌ పాల్గొన్నారు.

గ్రామ సంఘం ఏర్పాటుపై అభ్యంతరం


మాట్లాడుతున్న నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరులో నిబంధనలకు విరుద్ధంగా, ఏక పక్ష గ్రామ సంఘం ఏర్పాటు చెల్లుబాటు కాదని దళిత ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం విలేకర్లతో వారు మాట్లాడుతూ.. మండలంలోని ఐకేపీ ఏపీఎం సత్యం, సీసీ సునిత సైతం నిబంధనలు పాటించలేదన్నారు. రెండు నెలల క్రితం జరిగిన గ్రామ మహిళా సంఘం కమిటీ పునరుద్ధరణలో ఇష్టారాజ్యంగా, ఏకపక్షంగా వ్యవహరించారని సంబంధిత గ్రామంలోని పలు సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై గ్రామ సంఘం నాయకులు, ఐకేపీ అధికారులను సంప్రదించినా కాలయాపన చేస్తూ మహిళా సంఘాల అభిప్రాయాల్ని అంగీకరించడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, జిల్లా నాయకుడు దస్తప్ప, అంబేడ్కర్‌ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

పూడూరు: కూలీకి వచ్చిన వివాహిత అదృశ్యమైన సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పుడుగుర్తి గ్రామానికి చెందిన చింతకుంట లక్ష్మమ్మ తన అక్క అయిన వికారాబాద్‌ మండలం అత్వెల్లి గ్రామానికి చెందిన కొంపల్లి జ్యోతి(35) పుడుగుర్తిలో మక్కలు విరిచేందుకు 15 రోజుల క్రితం కూలీకి వచ్చింది. తన చెల్లెలు ఇంట్లో ఉంటుంది. ఈ నెల 3న అందరు తిని ఇంట్లో పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికే జ్యోతి కనిపించలేదని, వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. ఈ మేరకు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన యువకులు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌గల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన చింటు, జశ్వంత్‌లు శనివారం మధ్యాహ్నం బైక్‌పై కందుకూరు వైపు వస్తున్నారు. మార్గమధ్యలో శ్రీశైలం రహదారి దెబ్బడగూడ గేట్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, వీరి బైక్‌ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడిన వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం తీవ్రతకు కారులో ఉన్న రెండు బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఏలాంటి గాయాలు కాకుండా తప్పించుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉల్లి సాగు.. లాభాలు బాగు

- యాజమాన్య పద్ధతులే ముఖ్యం
- తాండూరు ఏడీఏ రుద్రమూర్తి



తాండూరు: రోజువారి వంటకాల్లో ఉల్లి ప్రధాన దినుసుగా ఎప్పటినుంచో మారింది. ఏ వంటకంలోనైనా ఉల్లిని తాళింపుగా వేయాల్సిందే. అది రుచితో పాటు ఘుమఘుమలాడే వాసన రప్పిస్తుంది. అలాంటి ఉల్లికి ప్రస్తుతం మార్కెట్‌లో భారీగా డిమాండ్‌ పెరిగింది. దీంతో అన్నదాతలు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రబీ సీజన్‌లో పంటను సాగు చేసేందుకు నవంబర్‌, డిసెంబర్‌ నెలలు అనుకూలమని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. ఉల్లి సాగుపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు.

విత్తే సమయం

రబీ సీజన్‌లో నవంబర్‌–డిసెంబర్‌ నెలల్లో ఉల్లి పంటను సాగు చేసుకోవచ్చు. వేసవి పంటగా సాగుకు జనవరి, ఫిబ్రవరి నెలలు అనుకూలం. వాతావరణంలో పెద్దగా మార్పు లేని ప్రాంతాల్లో వీటి ఎదుగుదల బాగుంటోంది.

అనువైన నేలలు

నీరు నిలవని సారవంతమైన మెరక నేలలు అనుకూలం. ఉప్పు, చౌడు క్షారత్వం, నీరు నిల్వ ఉంటే నేలలు పనికి రావు.

ఉల్లి రకాలు

బళ్లారిరెడ్‌, రాంపూర్‌రెడ్‌, వైట్‌ అనియన్‌, పూసారెడ్‌, అర్కనికేతన్‌, అర్కకల్యాణ్‌, అర్కప్రగతి, కల్యాణ్‌ప్రగతి, కల్యాపూర్‌, రెడ్‌రౌండ్‌, యన్‌–53, అగ్రిఫౌండ్‌ డార్క్‌రెడ్‌ తెలుపు రకాలైన పూసావైట్‌రౌండ్‌, పూసావైట్‌ ఫ్లాట్‌లు ఉల్లి పంట సాగుకోసం అనుకూలమైనవి.

నారు పెంచటం

ఎకరాకు 3–4 కిలోల విత్తనాలు పడతాయి. నేలను బాగా దుక్కి దున్ని 120 సెంటీమీటర్ల వెడల్పు, 3 మీటర్ల పొడవు గల ఎత్తైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. 2–2.5 కిలోల విత్తనాన్ని 200–250 చ.మీల నారుమడిలో పెంచిన నారు ఒక ఎకరాలో నాటడానికి సరిపోతోంది. విత్తనశుద్ధి తప్పకుండా చేసుకోవాలి.

- 3 గ్రాముల కాప్టాన్‌ లేదా థైరమ్‌ కిలో విత్తనానికి నారుమడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు, తెగులు సోకకుండా 10 రోజులకోసారి కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పెరుగుదల దశలో రసం పీల్చే పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి.


ఉల్లి పంట

ఉల్లి నారు నాటే విధానం

రెండు నుంచి మూడుసార్లు దుక్కి దున్ని పొలాన్ని చదును చేయాలి. 30 సెం.మీ. ఎడం చేసి బోదెలు తీయాలి. బోదెకు రెండువైపులా ఉల్లి నారును నాటాలి. నారును 1శాతం బోర్డో మిశ్రమంలో ముంచి నాటడం వల్ల నారుకుళ్లు సోకకుండా ఉంటుంది. రబీలో డిసెంబర్‌ మొదటి పక్షంలో నాటుకోవాలి.

కలుపు నివారణ చర్యలు

నాటే ముందు ఫ్లుక్లోరాలిన్‌ 45శాతం ఎకరాకు ఒక లీటరు నీటి చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్‌ 30శాతం ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటరు లేదా ఆక్సిఫ్లోరోఫిన్‌ 23.5శాతం 200 మి.లీ. చొప్పున ఏదోఒక దానిని నాటే ముందు పిచికారీ చేయాలి. లేదా నాటిన 2–3 రోజుల్లో తేమ ఉన్నప్పుడు ఎకరాకు ఆక్సిఫ్లోరోఫిన్‌ 23.5శాతం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాటిన 30 నుంచి 45 రోజుల మధ్య మరలా కలుపు తీసి మట్టిని ఎగదోయాలి.

నీటి తడులు

నాటిన 60 రోజుల వరకు 12–15 రోజుల వ్యవధిలో 4–5 తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో 6–7రోజుల వ్యవధితో 7–8 తడులు ఇవ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరును కట్టుట ఆపాలి.

సస్య రక్షణ

ఉల్లికి తామర పురుగులు ఆకులు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి వేయడంతో తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. దానితో పాటు ఆకులపై కాడలపై ఊదర రంగు మచ్చలు వస్తాయి. వీటి నివారణకు డైమెథోయేట్‌ లేదా ఫిప్రోనిల్‌ 2 మీ.లీ లేదా మాంకోజెబ్‌ 2 గ్రాముల నీటి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు

ఆకులపై ఊదరరంగు మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి. వాతావరణంలో తేమ ఎక్కువైనప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మాంకోజెబ్‌ 3 గ్రాములు లేదా క్లోరోథలోనిల్‌ 2.5 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

- ఉల్లిలో ఆకు తినే పచ్చపురుగు నివారణకు కార్బారిల్‌ 3 గ్రాములు, లేదా ఎండోసల్ఫాన్‌ 2 మి.లీ లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- రబీ సీజన్‌లో పండించిన ఉల్లి పంట ఎకరాకు 120–140 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.